జానకి

(ఒక చిన్నకథ)

భమిడిపాటి రామసోమయాజులుగారు, బి. ఏ.

"చూసేవా, యీ గోదావరీ ప్రవాహంతో కొట్టుకొనిపోకుండా, ఆనక్షత్ర ప్రతిబింబాలు నీటిపైతేలి తమస్థానాలు ఎదలకుండాయే తీరుననిలచి వున్నవో!–అదుగో, అట్లాగే కాలంతో అంతరించి పోకుండా, నా చిన్ననాటనుండిన్ని జరిగిన సంగతులన్నీ నామనస్సులో పైరి తేలినిలచి వుంటవి." అన్నాడు సుదర్శనం మెల్లని గొంతుకతో.

"నిజమే, యెన్నాళ్లుగడచినా మరపుండదు కొందరికి- నాకు మాత్రం నిన్నటిసంగతు లీరోజునే జ్ఞాపకముండవ" న్నా డప్పారావు కొంచెం బిగ్గరగా.

సుదర్శనం పెద్దనిటూర్పు విడచేడు. తరువాత కొంతసే పూరకున్నాడు. ఏమిచెప్తాడా సుదర్శనం యీపైనని ఆత్రంలో, తొడమీద చేతిముడుకు నానుకొని, చేతిపై గడ్డమునానుకొని ఆ చీకట్లో కొంచెం కొంచెం కానవస్తూన్న సుదర్శనం ముఖంలోకి చూస్తూన్నాడు అప్పారావు. రెండునిముషా· ల్లట్టేవుండి, మరొకనిట్టూర్పు విడచినాడు సుదర్శనం. సుదర్శనం కళ్లంట నీళ్లు కారుతున్నవని అప్పారా వనుకున్నాడు. కొంచెం భయపడుతూనే అతడి కన్నులు తన వ్రేళ్లతో నంటి నీళ్లు రాలేదుకదా అని సంతుష్టిపడి ఆసంతోషంవల్లనే కాబోలు మరం కొంచెం కదల్చే డప్పారావు, 'సుదర్శనాని కంతసులువుగా కన్నీళ్లు వస్తాయా?' అనుకున్నాడు మనస్సులో.

వా రిద్దరూ కూర్చున్న పడవ చల్లగాలికి కొంచెమూగుతున్నది. గోదావరిలోని పిల్లతరగలు ఆ పడవకు తగిలి "కళకళ్క్ర" మని చిన్నచప్పుడు కలిగిస్తున్నవి. అంధకారము ప్రపంచము నంతనూ తనచల్లని కడుపులో పెట్టు కొన్నది. ఆ ప్రదేశమంతా కేవలమూ నిర్మానుష్యం కాకపోయినా, నిర్మానుష్యమేమో అన్నట్టులున్నది.–పడవల మీద నక్కడక్కడ కొందరు గాఢనిద్రాపరవశులై యున్నారు.

"అయితే, తరువాత నేమి జరిగింద" న్నాడు అప్పారావు, గడ్డంకింది చేయి మార్చుకుని.

"ఇటువంటి విషయాలు జ్ఞాపకం వచ్చినప్పుడు, నాకు మనస్సులో అనేకములైన ఆలోచనలు పరుగులెత్తి పోతవి—దానితో ప్రపంచమే మరచిపోతాను—అని మరొక పెద్ద నిట్టూర్పువిడచి, అంధ కారంలో లీనమై పోయిన పవిత్ర గోదావరీ జలమువైపు జాలితో నిండి పోయిన చూపులు నిలిపేడు, సుదర్శనం.

"అయితే. చివరకు, పురుషోత్తం జానకిని వదలి పెట్టివేసేడాయేమిటి?"

"వదలి పెట్టడమనగా, విశాఖపట్టణంలో పుట్టినింటికి పంపించేశాడు తాను. జానకిమాత్రం పురుషోత్తం మనస్సు సంపూర్ణంగా మారి పోయిందనీ, తనమీద అతడికి ప్రేమలేశమున్నూ లేదు సరికదా, తాను అతడితో బ్రతుకుటే అతడికి అసహ్యమనీ తెలుసుకున్నది.— జానకికి, పెద్ద తెలివితేట లుండేవా అంటేనే చెప్పలేను కాని, సామాన్యమైన తెలివి లేకపోలేదు. పురుషోత్తం ఆఖరుదినాల్లో అనుకున్నట్లు మొద్దుమాత్రం కాదు. అందుచేత భర్తయొక్క మనస్సు ఆపాటి కనిపెట్టలేక పోతుందా? అందులోనూ పురుషోత్తం తనమనస్సు భార్యకి తెలియకుండా దాచ గలడా?—

"కొన్నాళ్లు, పుట్టింటికి వెళతానని జానకి అన్నప్పుడు, యెన్నోవిధాల బ్రతిమాలి, 'నీవు దగ్గరలేకుంటే నాబ్రదుకంతా అంధకారంవలె వుంటుం'దనీ, 'నిన్ను విడచి నేనీ చెన్నపట్నంలో వుంటే, చచ్చేవే తోచదనీ' చెప్పి పంపించకుండా వుండే, పురుషోత్తమ శర్మ,—యిప్పుడు జానకి నేవెళ్లను వెళ్లనంటూంటే బలవంతపెట్టి విశాఖపట్టణం దిగబెట్టి పోయేడంటే,—యెంతబుద్ధి తక్కువపిల్లయినా జానకి ఆమాత్రంపోల్చుకోలేకుండావుంటుందా? ఇదొక్క విషయమేనా? పుట్టింటికి పంపేముందైనా ఒక నెలదినాలు తనతో భర్త సరిగా మాటే ఆడకపోవడమూ, తానేదైనా పొరపాటు పనిచేస్తే విపరీతంగా మండిపడి పోవడమూ, వంట యెంత బాగాచేసినా, బాగులేదని తిట్టడమూ మొదలుగాగల మార్పులు అనేకం కనిపెట్టింది జానకి—

"విశాలాక్షిని చూచి పురుషోత్తం మోహించినాడని కూడా, జానకికి తెలిసింది. తానంటే యింత అసహ్యానికదే హేతువని ఆమె బాగా యెరుగును. విశాలాక్షిని చాలాసార్లు జానకి చూచినది. మైలాపూరులో వారింటికి అనేక సార్లు జానకి వెళ్లినది కూడాను. మొట్టమొదట కొన్నాళ్లు విశాలక్షి అంటే జానకికి చాలా ప్రీతిగానే వుండేది; ఆవిడ పాటంటే చాలా యిష్టంగానే వుండేది; కాని, క్రమ క్రమంగా, జానకి హృదయంలో విశాలాక్షిని తల్చుకునే సరికి మంటలు మండడము ప్రారంభించినవి. కలలలోకూడ విశాలాక్షి తనకు శత్రువుగా కానవస్తూండేది. మొట్టమొదట విశాలాక్షిని చూచినప్పుడు, ఆమె యెంత అందంగా వున్నదని అను కున్నదో చివరకంత అసహ్యాకరమైన దృశ్యంగా మారిపోయిం దామె ముఖం. ఆ సోగకన్నులూ, ఆ నిడుపైన ముక్కు, ఆ పగబట్టిన పాముమూతివంటి మూతిన్ని—నిత్యం జానకి హృదయంలో తహతహ కలిగించేవి. కట్టకడపటికి అందంగావున్న స్త్రీలను యెవరిని చూచినా ఆవేదనపుట్టడం ప్రారంభించింది జానకి మనస్సులో—"

"విశాఖపట్టణం తీసుకొనువెళ్లి తన్ను పుట్టినింట విడచి పెట్టడము, తిరుగా చెన్నపట్టణానికి తీసుకొని వెళ్లే అభిప్రాయంతో కాదని జానకి తెలుసుకున్నాది. అయినా చూతామని రెండు ఉత్తరాలు వ్రాసింది జానకి పురుషోత్తానికి—వచ్చి తన్ను తీసుకుపొమ్మని. ఆ రెండుత్తరాలకీ జబాబు యివ్వడమే మానివేసేడు పురుషోత్తం. జబాబులు రాక పోవడము చూచి మరింత ఆందోళన మెక్కువై జానకి చెన్నపట్టణం ప్రయాణ మాదామని నిశ్చ యించుకొన్నది. తల్లితోగాని, తండ్రితోగాని, ఒక్క నాతో తప్ప, మరెవ్వరితోనూ కూడా చెప్పలేదు. జానకి పురుషోత్తం చేసినమోసం- ఏసంగతైనా నాతో మాత్రంచెప్పేది. నేనంటే ఆమెకు విపరీతమైన నమ్మకం. జానకిఅంటే నాకు కేవలం ప్రాణమే అని నీ వెరుగుదువుకదా!

"చెన్నపట్టణం తాను వెళ్లినట్లు, తనయింటివద్ద పురుషోత్తం లేకుంటే, మైలాపూరులో విశాలాక్షి బసకు తానువెళ్లి పురుషోత్తాన్ని పిలచినట్లు, 'నా ప్రాణేశ్వరుని నీవు పిలుస్తావా? గెంటించి వేస్తాను చూ'డని గుడ్లెర్ర చేసి, విశాలాక్షి తన్ను వీధిలోనికి గెంటి తలుపు వేసి

నట్లు, ఒకనాటి రాత్రి జానకికి కలవచ్చింది. ఆ రాత్రి యంతా, నిద్రపట్టక ఆకల తలచుకొని దుఃఖపడుతూ, యేవిధంగానైనాసరే చెన్నపట్టణం వెళ్లి పురుషోత్తాన్ని కలుసుకొని, విశాలాక్షి వలలోనుండి ఆతడిని తప్పించి తిరుగా తన వాడినిగా చేసుకుందామని సర్వనిశ్చయం చేసుకున్నదా పతివ్రత. ఈ కాలంలో నిజమైన పతివ్రతలు లేరంటూరు కొందరు. నాకుమాత్రం ఆనమ్మకం లేదు. కాలంతో సంబంధం లేకుండానే మహాత్ములు పుట్టుతూంటారు. జానకి మహాపతివ్రత. పురుషోత్తాన్ని నిజంగాదేవుడని నమ్మివుండేది. ఆపె ప్రేమ, అదొక మహాసముద్రం. నిముషం ఆతని విడచివుంటే యెంతో బాధ అనిపించేది, ఆతల్లికి. అదుగో! నాకుకళ్లకు కట్టినట్లు కానవస్తున్నాది జానకిఇప్పుడు! ఆవాలుజడ;ఆ లేటకన్నులు; ఆ అమాయికపు పెదవులు; ఆ నిలుమంటు; పాపం! అప్పారావు! యీ తరువాత జానకి నామనస్సుకి యెన్నోసార్లు కానవచ్చిందికదా; యెప్పుడైనా కంటనీటితోనే కానవచ్చిందోయి—అట్లా మారిపోయిందా తల్లిజీవితం! యీ భర్త మోసంచేసేవరకూ ఆపె కంటనీరు పెట్టియెరుగదు. ఒక్కసారి మహాసంతోషంలో నుండి మహాదుఃఖం లోనికి దిగి పోయిందా విశ్రబ్ధకు.

"అట్లా నిశ్చయించుకొని, మరునాడు తల్లితో 'చెన్నపట్టణం బయలు దేరుతున్నా'నని చెప్పింది. తల్లికి చాలావింతగా తోచింది.— జానకి చాలా అమాయకురాలు; గడుసుదనమెరుగని ముద్దరాలు; మితభాషి— పొరుగింటికైనాసరే యెన్నడూ తా నొక్కతే పోనేరనిది— తల్లికి చాలావింతగా తోచింది. 'పురుషోత్తం రాకుండానే, తానే తనంతట చెన్నపట్టణం బయలుదేరుతున్నదే— ఆహా! భర్తంటే అంతప్రేమ ఉంటుంది కదా!' అనుకున్నది మనస్సులో. అయితే, జానకి యెవ్వరి సహాయమూ లేకుండా చెన్నపట్టణం వెళ్లజాలదని తల్లి బాగా యెరుగును.

"సరే! నీకంతగా వెళ్లాలని ఉంటే వెళ్లు. మీ నాన్నగారూళ్లో లేరు: పోనీ! నే వస్తానూ!"

"అక్కరలేదు; సుదర్శనం వస్తాడు."

"ఆతడు వస్తానన్నాడా?"

"అనలేదు గాని రమ్మంటే వస్తాడు. ఈ దినమే బయలుదేరుతాను. మీయల్లుడు యేమికారణమువల్లనో లేదో,- అక్కడ ఆయన కెవ్వరూ లేరు"-

అనిచెప్పి జానకి నన్ను పిలిచినది. నాతో తన దురవస్థంతా కన్నీరుతో చెప్పినది. "ఈ యాపదసమయంలో నాకు సహాయంచేసేవాడవు నీవేసుమా!" అని చెప్పి ముఖ మెర్రబారేలాగు యేడిచినది. నేను చెన్నపట్టణం తీసుకొనివెళ్లి భర్తదగ్గర విడచిపెట్టుతానని చెప్పితే,- "అలాగునకాదు, కొన్నిదినాలు నీవక్కడుండి, నా ఆపద తొలగిపోయాక తిరిగి వెళ్లుదువుగాని లే!" అన్నది. నేను'సరే' అన్నాను. అంతకుముందు యీప్రపంచంలో నే నొక్కడనే కష్టజీవితం గడపుతున్నాననుకున్నాను. జానకివంటి పూజ్యురాలికి భగవంతుడిట్లు ఆపద లీయజాల డనుకున్నాను.— పోనీ జానికి నన్ను పెండ్లియాడకున్నా, సుగుణవంతుడు, ప్రేమమూర్తియైన పురుషోత్తాన్ని పెండ్లియాడినది. ఆతడు బాగా చదువుకున్నవాడు, జానకికి ఆతనికి సముద్రానికి వెన్నలకు, ఉన్నంతటి ప్రేమ.— బాగానే ఉన్నది. జానకి సంతోషమే నా సంతోషము: జానకిసౌఖ్యమే నా సౌఖ్యము- అనుకొని కాలముగడపేవాడను. జానకి నన్ను పెండ్లియాడనప్పుడు నాకు పెండ్లి మరి వద్దని మానివేసినాను— సరే ఆగొడవ యెందుకు లే.— ఈదురవస్థంతా చెప్పినతరువాతసరే, జానకివిచారము నావిచారము జానకికష్టము నాకష్టము,— అందువలన యీ యాపదలనుండి జానకిని తప్పించే బాధ్యతంతా, నాదేకదా అని, "ఈ యాపదసమయంలో నాకు సహాయంచేసేవాడవు నీవే సుమా!" అని జానకి యేఉద్దేశం మనసులో పెట్టుకొని అన్నదో తెలుసుకుని - తప్పకుండా జానకిదేవిని, యీవిపత్తునుండి రక్షించాలని మనోనిశ్చయం చేసుకున్నాను. చెన్నపట్టణానికి ప్రయాణం ఆరోజునే యేర్పరచినాము. నేను తనతోవస్తున్నాను కదా, తన కింక ఘరవా లేదని చాలా ధైర్యంతో బయలుదేరినది జానకి."—

ఇంతసేపటికి మళ్లీ పెద్ద నిట్టూర్పొకటి విడిచినాడు సుదర్శనం. అంత చీకటిలోనూ, ఆతనికన్నులు

మెరసినవి. గోదావరీప్రవాహం సడిలేకుండా సాగిపోతున్నది. ఆ అంతులేని ఆకాశంలో నక్షత్రాలు మెరసిపోతున్నవి. ఆవేసవి రాత్రిలో సగముపైగా గతించినది. మందమారుతము నిద్రపోయే జీవులను జోకొట్టుచున్నది. పగలు విపరీతమైన గోలతోనిండి తనలో తనకే ఊపిరిసలుపకుండావున్న రాజమహేంద్రవరము నిద్రలోనున్న పెద్దపులివలె శాంతం వహించినది.—అప్పారావు మకం కదల్చి, గడ్డంక్రిందిచేయి మార్చుకుని, తానుకూడా ఒకనిట్టూర్పువిడచి, సుదర్శనంవైపు హెచ్చిపోతూన్న ఆత్రంతో చూస్తున్నాడు. అట్లా కొంచెం సేపూరకుని, మళ్లీచెప్పడం మొదలుపెట్టాడు సుదర్శనం. కథ యెంతసేపైనా చాలానెమ్మదిగానూ మెల్లగానూ చెప్పుతున్నాడు సుదర్శనం. 'ఊఁ!' అని ఊకొట్టడం కూడామరచిపోయి జానకి కష్టచరిత్రం వింటున్నాడు అప్పారావు. 'పాపం! జానకిఅంటే సుదర్శనానికి యింత ప్రేమఉండబట్టే, ఆవిడ చిత్రాన్నే తనవద్దనుంచుకుని యీ మహాప్రపంచంలో మరొకవస్తువును దేనిని ప్రేమించడంమాని కాలం గడుపుతున్నాడు! ఓహో! యేమి ఔదార్యంకదా! ఈరోజుల్లో యీతడిగంభీరహృదయం లోకి తొంగిచూచినవాడులేడు; యితనిమెచ్చినవాడులేడు; పిచ్చివాడని కొందరూ, దొంగఅని మరికొందరూ. ఆహాహా! యీమానవప్రపంచం గుడ్డిదికదా;' అనుకుంటున్నాడు మనస్సులో అప్పారావు. అప్పారావు యెవ్వరినైనా మెచ్చాడుకాని తనుజన్మమెత్తినిందించడం యెరగడు. సుదర్శనం, నిట్టూర్పులె శ్రుతిచేసుకొని, తనవిషాదకావ్యం గానంజేయడం ప్రారంభించాడు ఈతీరున—

"ఆదినం మెయిలులో బయలుదేరినాము చెన్నపట్టణానికి, జానకినేను— మరునాటి ఉదయం తొమ్మిదిగంటలకు చెన్నపట్టణంలో ట్రిప్లికేనులో పురుషోత్తంయింటికి చేరాముజట్కామీద. బండిదిగి లోపలకు వెళ్లినది జానకి. పెట్టెపరుపు తీస్తూబండివద్ద నిలువబడ్డాను నేను. లోపలకు వెళ్లి తిరుగావచ్చి సామానుతీసుకు నన్నులోపలకు రమ్మన్నది జానకి. సామానుపట్టించుకొని లోపలకు వెళ్లినాను నేను. పురుషోత్తం లోపల చావడిలో క్రాపుదువ్వుకుంటున్నా డద్దంచూచుకొని. అప్పుడే స్నానంచేసివచ్చిన ట్లున్నాడు. దువ్వుకుంటూనే ఒకసారి నన్నుచూచాడు పురుషోత్తం. ఆచూపులో నారాక తనకిష్టంగాలేదని నేగ్రహించాను. అతడియిష్టం కొరకు రాలేదుకదా అని మనస్సులో సంతుష్టిపడ్డాను. అతడివైపే చూస్తూ నిలువబడ్డా నాసావడిలో నేను. సావడిపక్కసావడితోనే కలసివున్న వసారాలో కూరుచున్నది జానకి. పాపం ఆమెకు రైలుబండిలో రాత్రిఅంతా నిద్దురలేదు — అంతకుముందేలేదు చాలరోజులనుండి. రెండుమూడు దినములనుండి భోజనంకూడా సరిగాలేదు— క్రాపు దువ్వుకొని బనియను షర్టుతొడుసుకొని, ఒకతువాలు పైనవేసుకుని, నాతోగాని జానకితోగాని మాట్లాడకుండా జోడుతొడుసుకొని తానొక్కడే యింట్లో నున్నట్లు సంచరిస్తూ వీథిలోకి నడచేడు పురుషోత్తం. జానకి నావైపు జాలిగా చూచింది. ఆమెవైపు నేను చూచాను. అచ్చటనే చతికిలబడ్డాను నేను. ఒక అరగంట అట్లాగునే కూర్చున్నామిద్దరమూసంభాషణలేకుండానే. అంతలో తిరిగివచ్చాడు పురుషోత్తం. వచ్చి కోటువేసుకుని, బీరువాలోని పుస్తకములు తీసుకుని, జానకివద్దకు వచ్చాడు. జానకిలేచినిలువబడి తలవంచుకున్నది. అయి

"జానకి లేచి నిలువబడి తలవంచుకున్నది."

దునిముషాలు పురుషోత్తం ఆమె ముఖపద్మంమీదకు యీటెలవంటిచూపులు పంపేడు. అంతవరకూ జానకి తలవంచుకునే నిలచింది. తరువాత—

"యేం! వంటైనా చేయకుండా అలాగు కూర్చున్నావు! నాభోజనమైంది. నేను కాలేజీకివెళ్తాను. టేబిలుమీదనున్నవి తాళాలు"

అని పురుషోత్తం వెళ్లిపోతూ నావైపు చురచుర చూశాడు. అతడి చూపులనూ అతడినీ ఒకగడ్డిపరకకంటెనూ చులకనగా చూసి మాటలాడకుండానే కూర్చున్నాను నేను. 'యెంత మారిపోయాడు పురుషోత్తం' అనుకున్నాను. మేమిద్దరమూ చిరపరిచయులము. అయినా పలుకరింపలేదు నన్ను. 'సరే యితడిపలుకరింపునాకెందుకు! పోమ్మన్నా నే పోయేబాపతుకాద'ని మనస్సులో అనుకున్నాను నేను. పురుషోత్తం కాలేజీకి వెళ్లిపోయినాడు. జానకివెళ్లి వీథితలుపు మూసింది. తిన్నగా నావద్దకువచ్చింది. ఆపెముఖం విశాఖపట్టణంలోకంటె రైలులోను, రైలులోకంటె, యిప్పుడు మారింది. జానకిముఖం అంతనీరసంగా కానరావడ మింతకుముందెన్నడూ నేచూడలేదు. కన్నులులోతునకు పోయినవి: కాని అందులో తీక్ష్ణమెక్కువైంది.—తిన్నగా నావద్దకువచ్చింది జానకి—

"చూశావా సుదర్శనం!"

"అయ్యో చూశాను – సరేలే. యింతిమాత్రానికి నీవు భయపడ నక్కరలేదు. యింకా చూడవలసినవి చాలాఉన్నట్టు కానవస్తున్నాది."

"తనుమనిషివస్తే పలుకరించకుండానే వెళ్లిపోయాడే– యెన్నడైనా యీమనిషివద్ద యిట్టిప్రవర్తన యిదివరకు చూశావా!"

"అతడి పలుకరింపుకోసం నేగా లేదులే."

"ఆమడతేకుర్చీలో కూర్చోనీవు. వంటచేస్తాను నేను. నాకోసంనీవు శ్రమపడుతున్నావు: పాపం!"

"నాకు శ్రమన్నదిలేదు. అందులో నీకోసం యేమిచేసినా నా కదియంతా సంతోషాన్నే యిస్తుంది. నీకొరకైపొందిన అవమానంకూడా నాకు యిష్టంగానే వుంటుంది. వెళ్లిత్వరగా వంటప్రయత్నంచేయి."

జానకిలోపలకువెళ్లినది. నేను ఆసావడి, దానిప్రక్కనున్నగది పరిశీలిస్తూ ఒకగంటకడపేను.

"పురుషోత్తమశర్మయొక్క అద్భుతచరిత్రంలో, జానకి నాకుచెప్పిన తరువాతిది కొంత సంగ్రహించాను. ఆగంటలో– సావడి, గది, పరీక్షిస్తే నాకు మూడువస్తువులు దొరికినవి. ఇరువది సంవత్సరములు వయస్సుగల ఒక అందమైనస్త్రీయొక్క ఛాయాపటము వకటి– విశాలాక్షి వ్రాసిన జాబు వకటి– ఒకదినంక్రిందట కూర్చబడి నేచూచినప్పటికి బాగానలిగిపోయియున్న మల్లెపూలదండ వకటి. గదిలోపుస్తకములమధ్య దొరకినది ఛాయాపటము. అతడి కోటుజేబులో దొరకినదిజాబు. గదిలోనొకమూలను పడియున్నది వాడుదండ. ఆ జాబుచదివాను. అది యీతీరుగావున్నది.

'My dearest Purushottam.

మీయింటి పక్కయింట్లోకి నేనూ మాఅమ్మా కూడా రేపు వచ్చివేస్తాము. నీవద్దనుండి యింతదూరంగా నేనుండజాలను. కాలేజీకి వెళ్తున్నాను కాని నామనస్సంతా నీపైనేవున్నది. యీసాయంకాలం అయిదుగంటలకు మాయింటికి నీవువస్తే చాలాసంతోషిస్తాను. యీదినం పౌర్ణిమ. నీవు నావద్దలేకుంటే నాకిది అమావాస్య అయిపోతుంది. తప్పకవస్తావని నమ్ముతున్నాను. మేడపైనుండి నీకొరకు రోడ్డువైపు చూస్తూంటాను. అయిదుగంటలకు నీవు కానరాకుంటే నేజీవించలేను. యీకాగితం నీవుచదివినవెంటనే చించి పారవేయి.

మైలాపూరు నీప్రియురాలు.
...-3-1920 (Visalakshi) విశాలాక్షి.'

ఆవుత్తరం పదరోజులక్రిందట వ్రాయబడినది నేవెళ్లిననాటికి. ఈపాటికి విశాలాక్షి తల్లి పక్కయింట్లో దిగివుంటారు అనుకున్నాను. పూలదండ నాకప్పుడు బాగాఅర్థమైంది. ఆఛాయాపటంకూడా విశాలాక్షిదే కదా అనుకున్నాను. ఛాయాపటంలో నేచూసిన విశాలాక్షి నిలుబడియున్నది. కుర్చీపై చేతినానుకొని వదులుగావేసుకున్న వాలుజడ తెలుస్తున్నది. తెల్లనిజాకెట్టు, తెల్లని, అంచులేనిచీర, మేజోడు, జోడు, చాలా అందంగామాత్రం వున్నది. మెడలో నగలులేవు. సన్నని బంగారు గొలుసుమాత్రం పైటపైనుండే మెడలో వ్రేలాడుతున్నది. సోగకళ్లు, నిడుపైనముక్కు, చిన్నపెదవులు చక్కనిగడ్డమూ, అంతపలుచగా కాకుండా, లావుగా కాకుండావున్న శరీరం.

"అక్కడనుండి నామనసులోనాకే కొన్ని వాదప్రతివాదాలు జరిగాయి. నేను యిప్పుడుచూచినవిషయం జానకితో చెప్పనా మాననా? చెప్పితినా, జానకి మహాదుఃఖంలో మునిగిపోతుంది. నేచెప్పకపోయినా జానకి కింకయెట్లాగైన తెలియకమానదు. చివరకు చెప్పకుండా దాచాలని నిశ్చయించుకున్నాను. ఆపూల దండమాత్రం తీసి నా పెట్టెలో పెట్టాను. ఉత్తరంకూడా దాచాను. ఫొటోపటం యెప్పటిచోటున పెట్టివేశాను. అంతలో జానకివచ్చింది.

'ఏమైంది స్నానంచేయమ'న్నదిజానకి. స్నానం చేశాను. భోజనంచేశాను. జానకికూడా భోజనంచేసి, యిల్లంతా సవరించుకునివచ్చి 'గదిలో మంచంపైన పండుకుంటా'నని చెప్పి పండుకున్నది. సావడిలో పడకకుర్చీపై కొంతసేపుపరుండి తరువాత వీధిలోనికి వెళ్లినాను. నేను తిరుగా సాయంకాలం అయిదుగంటలకు జానకివద్దకు వెళ్లినాను. నేను యిల్లువిడచి వెళ్లినతరువాత మధ్యాహ్నం రెండుగంటలకింటికి వచ్చినాడు పురుషోత్తం. జానకినాకు ఆవృత్తాంతం చెప్పినది.

"పురుషోత్తం యింటికి వచ్చేసరికి జానకిగదిలో మంచంమీదనే పండుకొనియున్నది. నిద్రమాత్రంలేదు. పక్కపైనక్కడక్కడ వాడిపోయిన మల్లెపూవు రేకులు చూచి, చాలాత్రొట్రుపాటుచెందిన మనస్సుతో నున్నది జానకి. పురుషోత్తంవచ్చి, జానకి తాను విశాపట్నంవచ్చి తీసుకొనిరాకుండా, యెందుకువచ్చిందని చాలా కోపంతో మాటలాడాడు. నాతో కలసివచ్చినందుకు మరంత మండిపడ్డాడు. నేను తనయింటివద్ద నుండకూడదని గట్టిగా శాసించాడు. ఆతడికోపం తగ్గినతరువాత అమాయికురాలైనజానకి యీతీరున పురుషోత్తంతో పలికింది.

"నేను రెండుత్తరాలువ్రాస్తే నాకు జబాబైనా వ్రాయడం మానివేస్తారా? యిదిమీకు న్యాయమేనా? నామీద నింతకోపం మీకు కలగేటంతటి అపరాధం నేను యేమిచేశాను? నామీద కొండంత ప్రేమవుండేది మీకుకొన్నాళ్లు.యిప్పుడుప్రేమరవంతైనా లేదుసరికదా; నాపొందే అసహ్యంగా కానవస్తున్నాది. విశాలాక్షితో పరిచయమెక్కువైన కొద్దీ నామీద నయిష్టమెక్కువైందిమీకు. అదనేనెరుగుదును. నేను మీపాదాలే నాకు దేవుడని నమ్ముకున్నాను. నన్ను యింత అన్యాయంచేసి త్రోసివేయడం మీకుధర్మమా? యీమంచంమీద నీమల్లెపూవురేకు లెట్లావచ్చాయి? మీకిదియేమైనా బాగున్నదా? విశాలాక్షిపాటి చేశాను కానా నేను? ఇకనైనా మీరు ధర్మం విచారించండి. నన్ను చంపివేయకండి. నాప్రార్థన మన్నించండి'' అని కాళ్లపైబడి, "మిమ్ము విడలేక అతడి సహాయంతోవచ్చాను; పంపివేయమంటే అతడిని పంపివేస్తాను; మీరు యేమిచేయమంటే అదిచేస్తాను; యెట్లావుండమంటే అట్లా వుంటాను; విశాలాక్షితో స్నేహంమాత్రం"అనేసరికి కాలితోతన్నాడుపురుషోత్తం. "నోటికివచ్చినట్లల్లా పేలుతానేం?" అన్నాడట. "విశాలాక్షి వూసెత్తితే నోరు నొక్కేస్తా"నన్నాడట. నోరు మూసుకొని వూరుకున్నది జానకి. సాయంకాలం నాలుగుగంటలకు, వంటచేయుమని చెప్పి సముద్రపుటొడ్డుకి షైరువెళ్లాడు దుర్మార్గుడు. నేను వెళ్లేసరికి వంటచేసుకుంటున్నది జానకి. నన్ను వెళ్లిపొమ్మన్నది జానకి. ఈవూరినుండివెళ్లను; మీయింటినుండి వెళ్లిపోతానని చెప్పి నాపెట్టె పరుపుతీసుకుని బయలుదేరి వెళ్లిపోతూ అప్పటప్పట వచ్చి నీక్షేమంకనుక్కుంటానులే, అన్నాను నేను. జానకి కన్నీరు విడిచినది. మాటాడలేదు. నాగుండె నీరైపోయినది. విచారిస్తూనే వెళ్లాను నేను. వెళ్లి ట్రిప్లికేనులోనే మరొక స్నేహితుడి బసలోవుండి నాప్రయత్నాలేవో చేయడం మొదలుపెట్టాను."

మరొక పెద్దనిట్టూర్పు విడిచాడు సుదర్శనం. యిప్పుడాచీకటిలో సుదర్శనంకళ్లు నిప్పులవలె మెరుస్తున్నవి. పైన యెంత చల్లగా హాయిగానున్నా, సుదర్శనంలోమాత్రం చాలావేడిగా బాధగానున్నది. తాను యెంతసేపు మాట్లాడుతున్నా ముఖం కదల్పలేదు. మనిషి రవంత చలించలేదు. మెల్లగా, చెపుతున్నాడుకథ. అప్పారావుమాత్రం కథసాగినకొలదీ, అనేక రకాలుగా కూర్చుంటూ అనేకభావాలతోమునిగిపోతూ, కన్నీళ్లు తుడుచుకుంటూ విపరీతమైన ఆత్రంతో వింటున్నాడు. 'యెన్నికథలువిన్నా ఈప్రపంచంలో దుఃఖంతో నిండిపోయినకథలే వింటున్నామకదా' అనుకుంటున్నాడు మనస్సులో. 'జానకిని పురుషోత్తం'కాలితోతన్నినప్పుడు తానైనా, సుదర్శనమైనా అక్కడనుంటే, పురుషోత్తం

పని యేమౌనా' అనుకున్నాడు మనస్సులో. 'బహుశా యీ పురుషోత్తం జానకిని తిరుగా విశాఖపట్నం పంపించి వేసివుంటాడు; తప్ప' దనికూడా అనుకున్నాడు అప్పారావు. ఆలాగున అనుకొని "ఆతరువాత నేమిజరిగింద"న్నాడు. అప్పారావునకు కథవింటూన్నప్పుడు అనేకసార్లు కన్నీళ్లువచ్చేయి. సుదర్శనమాత్రం ఒకసారైనా కంట తడి పెట్టుకోలేదు. మళ్లీ ప్రారంభించాడు సుదర్శనం.

"నేను కనుక్కుంటే, విశాలాక్షి జాబులో వ్రాసిన ప్రకారం వచ్చిమరునాడే పురుషోత్తం యింటిపక్క యింట్లో బసచేసినట్టులు స్పష్టమైనది. తరువాత విశాలాక్షిని నేను చూచాను. విశాలాక్షిమాత్రం అందకత్తె అగును. పురుషోత్తంకంటె గట్టిగుండెవున్నవాడైనా మోహిస్తాడేమో ఆమె గాలిసోకితే. కాని జానకి భార్యయైయుండగా యెంత మూర్ఖుడైనా, ఆపె యెంతఅందంగా వున్నా యెట్లామోహించాడా అనుకుంటూ! అయితే జానకిలోవున్న ఘనతయేమో పురుషోత్తం గ్రహించుకోలేకపోయాడు. వేయిపుటములు పెట్టినా విశాలాక్షి జానకికి సాటివస్తుందా అనేసంగతి తెలుసుకోలేక పోయాడు. కొంచెం చామనచాయగానుండి చూచేసరికి అందంగా చురుకుగా కానవచ్చే స్త్రీ కాకపోగానే మోహం తగ్గింది పురుషోత్తానికి. విశాలాక్షితో స్నేహం వృద్ధికాగానే జానకిపై అనురాగమే నశించింది పురుషోత్తానికి. నాకు మాత్రం విశాలాక్షిని చూచేసరికి వళ్లుమండింది. జానకికి కాదు: నాకు సవతివలె కానవచ్చింది విశాలాక్షి."—

కంటినీటితోనే పకపకనవ్వాడు అప్పారావు. సుదర్శనం విశాలాక్షిని యిప్పటికిన్ని తనసవతిగా భావిస్తూన్నట్లు చిరునవ్వైనా నవ్వలేదు.

"యేవిధంగా, పురుషోత్తాన్ని జానకిని యెప్పటి భార్యాభర్తలుగా చేయడమా అనే ఆలోచనతో నాకు రాత్రి నిద్దురపట్టలేదు: భోజనముపై మనసుపోలేదు. ఒకసారి పురుషోత్తాన్ని కలుసుకుని అతడికి ధర్మోపదేశంచేతామా అనుకున్నాను. మరొకసారి మరియేదైనామోసం చేసైనా విశాలాక్షికిన్ని పురుషోత్తానికిన్నీ కలసంబంధం తెగగొడదామా అనుకున్నాను. మరొకసారి జానకిచేతనే సెమ్మదిగా బ్రతిమాలించి, చాకచక్యంగా కథనడపి పురుషోత్తం బుద్ధితూర్చుదామా అనుకున్నాను. ఇంకొకసారి విశాలాక్షితో స్నేహంచేసి ఆపెకు యెవరినైనా భర్తనుకుదిర్చి వారికి వివాహముచేయించి తద్ద్వారా విశాలాక్షికి పురుషోత్తంపైనున్న వ్యామోహం పోగొడదామా అనుకున్నాను. ఏమియుతోచక వెర్రివానివలె కొంత కాలం రాత్రులుకూడా ఆ ట్రిప్లికేను వీధులంటతిరిగాను. కట్టకడపటకు యెందుకైనా మంచిదని విశాలాక్షితో పరిచయంగలిగించుకుందామని నిశ్చయించుకున్నాను. విశాలాక్షి తల్లితో వకనాడు వెళ్లి మాట్లాడాను. ఆమెకు విపరీతమైన స్వాతిశయమున్నట్లు గ్రహించాను. కూతురు బి. యే. పరీక్షకు చదువుతున్నాదనే గర్వం, తాను యమ్ ఏ. పాస్ అయినంతటి గొప్పదనం గలిగించిందావిడ హృదయంలో.—తనకూతురు చాలా తెలివితేటలు కలవనీ, క్లాసులో అందరికంటెనూ బాగా చదువుకుంటున్నాదనీ చెప్పినదామె. తెలుగులో కొంచెం కవిత్వంకూడా చెప్పతుందని చెప్పింది. ప్రసంగవశంగా చెప్పినట్లుగా ఆవిడతోనే కవినని కూడాచెప్పాను. బి. యే. పాసయినాననని చెప్పినాను. కొన్నిగ్రంథాలు నావి అచ్చుపడినవనిచెప్పినాను. "ప్రేమగీతావళి" ఒక కాపీ ఆవిడకు యిచ్చినాను. ఉదయంగాని, సాయంకాలంగానివస్తే విశాలాక్షి యింటివద్ద నుంటుందనిచెప్పి, ఆమె విశాలాక్షినిమాచి మరీ నేను చెన్నపట్టంనుండి వెళ్లాలనీ, కవులంటే విశాలాక్షికి మరిభోజనముకూడా అక్కరలేదనీ చెప్పినది. ఈరూపంగా విశాలాక్షితో మైత్రికలగడానికవకాశం దొరకినందుకు చాలాసంతోషిస్తూ నాబసకువచ్చాను.

"క్రమక్రమంగా విశాలాక్షికీ పురుషోత్తానికీ ప్రేమ హెచ్చిపోయింది. కాలేజీ చదువూ అవకాశం వుంటే చూచుకునే వ్యాపారంగా కానవస్తున్నది వారికి. జానకిఉనికి వారికిచాలా కష్టంగా కానవస్తున్నది. పురుషోత్తం జానకితో మాటలే చాలావరకూ కట్టిపెట్టాడు. ఆయింట్లో జానకి బ్రదుకుచాలా హీనంగా వున్నది. పురుషోత్తంయింట్లోకి విశాలాక్షి జానకి ఉన్నప్పుడే రెండు మూడుసార్లువచ్చినది. జానకి వంటచేసుకుంటూన్నప్పుడు వారిద్దరూ గదిలోకుర్చీలపైకూర్చుని మాటలాడుకోవడమూ, నవ్వుకోవడమూకూడా ప్రారంభించినారు. వారి కంతధైర్య మెట్లాకలుగుతున్నదా అని అనుకొనేది

జానకి. తానాసమయంలో యేమిచేయగలనా అనుకొనేది జానకి. ఏమిచేయుటకుతోచక, భయపడి దుఃఖపడుతూ చేతగానిదై తానుండబట్టే వారి కంతధైర్య మనుకుంటున్నది జానకి. ఆపె కేమియు పాలుపోలేదు. నాతో నీ సంగతులు చెప్పినప్పుడు, నాకంతకంటెనూ పాలు పోలేదు. ఒకనాడు వాసలహా లేకుండానే జానకి, పురుషోత్తం, విశాలాక్షి మాట్లాడుకుంటూంటే ఆగది ప్రక్కకు మెల్లగావచ్చి వారిసంభాషణ యాలకించుటకు ప్రయత్నించినది. అతి నెమ్మదిగా వారు మాటలాడుకొనుటచే ఆసంభాషణ అంతయు నాపెకు వినబడలేదు కాని, కొన్నిమాటలు వినబడినవి. విశాలాక్షి "యీజానకిని మనం వదల్చుకోవాలి" అన్నది. పురుషోత్తం, "దీని వదల్చుకోనిదీ మనకు వివాహ మెట్లా సాగుతుం" దన్నాడు. "అంతసులువుగా వదలేలాగు కానరాదే" దంది విశాలాక్షి. "నేనుచేస్తాగా దానికి" అన్నాడు పురుషోత్తం. ఆమాటలు విని జానకి నిలువున నీరైనది. ఆమెకు కన్ను లగపడలేదు. ప్రపంచమంతా గిర్రునతిరిగినది. ఆమెకు కోపము, దుఃఖమూ, అసూయ, ఒక్కసారి మనసునిండి యుక్కిరిబిక్కిరియై పోయినవి. ఒక్కనిముష మట్లుండి జానకి తటాలున గదిలో చొరబడినది.

"యెందు కిక్కడికి వస్తున్నావ"న్నాడు పురుషోత్తం గంభీరంగా. "వంటైంది మడిగట్టుకొమ్మని చెప్పడాని"కన్నది గట్టిగానే జానకి. "వంటైతే, నే వచ్చి కనుక్కుంటానులే పో" అన్నాడు పురుషోత్తం. "నా పనియైనది. నేపోవడ మెందుకు. నేనూ యిక్కడనే వుంటాన"న్నాది జానకి.

"నీవిక్క డుండవద్దు. చెప్పగానే వెళ్ళ"న్నాడు పురుషోత్త. "నేవెళ్లను. ఆవిశాలాక్షిని వెళ్ళమనండి. ఆవిడ యిక్కడకు రావలసినపని యేమున్నది. మీరిద్దరూ రోజూ యింతగా మాటాడవలసినపని యేమున్న ద"న్నాది జానకి గద్గదికతో. ధైర్యంతో, పురుషోత్తం లేచి జానకిని చేయిపట్టుకుని వంటయింటికడ్డ కీడ్చి కూర్చుండబెట్టి, "విశాలాక్షి జోలికొస్తివా చంపేస్తాను, జాగ్రత్త" అన్నాడు.

"చంపేస్తే చంపేయండికాని విశాలాక్షి మన యింటికి రాకూడదు. మీరు వారింటికి వెళ్లకూడద"న్నది జానకి.

పాపం. పురుషోత్తం జానకిని కొట్టాడు. జానకి దుఃఖపడుతూ వంటయింటిలో నేలబట్టిపోయినది.

"అనాటినుండి, విశాలాక్షి పురుషోత్తం యింటికి రానన్నది కాబోలు. పురుషోత్తం విశాలాక్షి యింటికి వెళ్లడమేజరుగుతూవచ్చింది. అట్లా కొంతకాలం గడచింది. నిద్రాహారములులేక జానకి మహాదుఃఖంతో నీరసిస్తున్నది. ఆభగవానుడికైనా ఆపతివ్రతాశిరోమణిపై జాలిలేకపోయింది. ఆపెదుఃఖంచూచి ఆయింటిగోడలుకూడా కన్నీళ్లు గార్చేయేమో!"

మరొకసారి నిట్టూర్పువిడచి యూరకున్నాడు సుదర్శనం. అప్పారావు కన్నీళ్లెక్కువైనాయి. పురుషోత్తంవంటివాళ్లని భూమ్మీదనెందుకు పుట్టించాడా భగవంతు డనుకుంటున్నాడు. మనసంఘంలో చిన్నతనంలోనే పెళ్లిళ్లుచేయడంవల్ల వచ్చేకష్టాలుకదా యివన్నీ ననుకుంటున్నాడు. ఇంగ్లీషువారిపద్ధతిని, స్త్రీపురుషులు జ్ఞానవంతులైన పిమ్మటనే తమకిష్టమైనవారి నెంచుకొనే వివాహం చేసుకుంటూంటే యిటువంటి మహాఘోరాలు జరగవుకదా అనుకుంటున్నాడు. జానకి సుదర్శనాన్ని విశాలాక్షి మరి అంత విపరీతమైన ప్రేమానుబంధం వున్నకారణంచాత పురుషోత్తాన్ని పెళ్లియాడివుంటే, యింతఘోరంగా వుండకుండా, తెంతోహాయిగా బ్రతికివుందురుకదా అనుకున్నాడు. 'పోనీ పురుషోత్తానికీ జానకికీ పెళ్లిఅప్పుడే అయిపోయినది కాబట్టి విశాలాక్షి సుదర్శనాన్ని పెళ్లియాడివేసినా చాలా అందంగావుండేదే' అనుకున్నాడు. మధ్యని, "నే నెందు కీఅనుకోవడము, నేనుకుని యీతరుణంలో యేమిచేయగల" ననుకుంటున్నాడు. ఆసమయంలో తనకు తెలిస్తే యేమయివుండేదో అనుకుంటున్నాడు. అప్పారావునకు యెప్పుడూకూడా ప్రపంచంలో అందరూ సుఖంగా ఉండవలెనని కోరిక, యెవరేకే యీజగత్తులో శ్రమపడి పోతారేమోఅని నిత్యమూ అతడు బెంగపెట్టుకుంటాడు. అప్పటికి రాత్రి మూడుగంటలైనది. తెల్లవారుజాము మంచు అప్పారావునకు కొంచెంకొంచెం

తెలుస్తున్నది. సుదర్శనమాత్రం కాలం నడచిపోతూం డడము పరికించనే లేదు. జానకిని మనసులో తలుచుకుంటూ, యీప్రపంచమంతా 'అనిత్య'మని 'రసహీన'మని అనుకుంటున్నాడు. కొంతసే పట్లాగే ఉండి తిరుగా ప్రారంభించాడు చెప్పడం సుదర్శనం "అయితే, జానకిని మళ్లా విశాఖపట్టణం పంపించివేశాడా యేమిటి" అన్నాడు అప్పారావు.

"ఒక ఉదయపువేళ విశాలాక్షిని దర్శించాను నేను. ఆపెతల్లి అంతకుముందే ఆపెతో చెప్పడంవల్ల, "ప్రేమగీతావళి" అప్పటికే చదవడంవల్ల నేనంటే కొంత గౌరవంకుదిరింది విశాలాక్షిమనస్సులో నేవెళ్లినప్పుడు నాతో చాలామర్యాదగా మాట్లాడింది విశాలాక్షి. విశాలాక్షితో మాట్లాడుతూంటే అదొకతమాషగా వుంటుంది. మాటలాడేటప్పుడుచేతులు, పెదవులు, కనుబొమలు, కన్నులుకూడా అభినయించేస్తవి. ఒకొక్కవిషయంఒకొక్క క్రొత్తఉత్సాహంతో చెపుతూంటుందివిశాలాక్షి. మంచిచురుకున్నదిబుద్ధిలో, ఆదినంమాసంభాషణం తాకవిత్వమూ ఆగోలతో నిండిపోయినది. తరువాతనొకటి రెండుసార్లా పెతో మాట్లాడడముతో బాగాపరిచయం కలిగింది. ఈసంపాదించిన పరిచయాన్ని జానకి విపత్తు తొలగించే మహాకార్యంలో ఉపయోగపరచటాని కవకాశం లేకుండానే కొన్ని ఆటంకములువచ్చేయి. అది దైవకృతం: నేనేంచేస్తాను?

"క్రమంగా జానకిని యింటివద్దవిడచి, రాత్రి వేళకూడా, విశాలాక్షియింట్లోనె గడపుడము ప్రారంభించాడు పురుషోత్తం. జానకికి ఆపదలు హెచ్చైపోతున్నవి. నా కేమిచేయడానికీ అవకాశం కానరాలేదు. ప్రతిదినమూ జానకిచెప్పే విషయాలువింటే శరీరం కంపించిపోతూంది. జానకి చాలానీరసపడిపోయి వికృతాకారం దాల్చింది. పురుషోత్తానికి జానకిచేసే ప్రతి పనీ అసహ్యంగానే కానరావడం ప్రారంభించింది. జానకిని చూస్తేనే వళ్లుమండుతూంది అతడికి.

"ఒంటరిగా రెండుమూడురాత్రుల్లు యింటిలో పరుండి, నిద్రలేక, మహాఆవేదనతో బాధపడి, బాధపడి, జానకి, ఒకనాటిరాత్రి తలుపులు తెరచుకొని వీథిలోనికివచ్చి విశాలాక్షి యింటితలుపు కొట్టింది. కొంచెము సేపటివరకున్ను యెవ్వరును తలుపుతీయలేదు తరువాత విశాలాక్షితల్లివచ్చి తలుపుతీసి "యెవరువార"న్నది. జానకి ప్రత్యుత్తర మీయకుండనే లోపలకు ప్రవేశించి తొందరతొందరగా ఆప్రక్కనున్న గదివద్దకు నడచినది. ఆగదిలో పెద్ద కాంతితో దీపము వెలుగుచున్నది. ఒక మంచముపై విశాలాక్షిన్ని, పురుషోత్తం దగ్గరగా ఒకరిచేయి నొకరు పట్టుకొని కూర్చున్నారు. జానకిలోనికి పరుగెత్తి విశాలాక్షిని చేయి పట్టుకొని పైకీడ్చి తా నా మంచముపై కూర్చున్నది. పురుషోత్తానికి ధైర్యం యావత్తు పోయి, ఒకనిముషం అక్కడనే స్తంభమువలె నిలచిపోయి తరువాత పైకివెడలిపోయినాడు. విశాలాక్షికూడా

"జానకి......తా నామంచముపై కూర్చున్నది,"

భయపడి ఆవలకుపోయినది. రెండునిముషము లాప్రక్క పైన నేకూర్చుండి తరువాత లేచినది జానకి. జానకికిభయం పోయినది. దుఃఖంవిపరీతమైపోయిమొండికెత్తిపోయినది. అంతలో విశాలాక్షితల్లి పెద్దగుడ్డచేసుకునివచ్చి జానకిని మెడపట్టి వీధిలోనికిగెంటి తలుపు బిగించినది. నాలు గైదుసారులు చేతులు రక్తముచిమ్మేటట్లు తలుపుబ్రద్దలు గొట్టి దుఃఖముతో రోడ్డుమీదకువచ్చి నిలువబడి పెద్ద రోదనమ్ముచేసినది జానకి. ఈబ్రహ్మాండమంతా తనపై నలిగినట్లు కానవచ్చింది జానకికి. మహాప్రళయమధ్యం లో తానునిలచినట్లు తోచింది జానకికి. భగవంతుడు ఆనాడే చచ్చిపోయాడనుకున్నది జానకి. ఆతలుపునేసి తలపగులగొట్టుకొని ఆత్మహత్య చేసుకుందా మనుకున్నది జానకి. కొంతసేపటి కారోడ్డుమధ్య కూలబడినది జానకి. లోలోనకుళ్లి కృశించిపోయినదిజానకి. ఆహాహా! ఈ విశాలమైన బ్రహ్మాండంలో దిక్కూదిశా లేకపోయింది మహాపతివ్రత జానకికి! కొంతసేపట్నుండి తిరుగా యింటి లోనికివెళ్లి చావడిలోపడి కళ్లుచెరువైపోయేలాగు రోదనం చేసింది జానకి."

ప్రారంభించినప్పటి శాంతంతో చెప్పలేకుండా వున్నాడు సుదర్శనం. ఆతడిమనస్సు పెద్ద కారుచిచ్చై చ పోతున్నది. కొలిమిలో యినుమువలె అతడి హృదయం పైకితెలియకుండానే కాలిపోవుచున్నది. నిట్టూర్పులు క్రమంగా దగ్గర పడుతున్నవి. అప్పుడావు అప్పట ప్పటు ఊపిరి తీసుకోడంకూడా మరచిపోయి వింటు న్నాడు యీదుఃఖచరిత్రం. వారికి బైటనుమాత్రం ప్రపంచం చాలాచల్లగా, శాంతంగా, హాయిగా వున్నది. ఆపవిత్రగోదావరి, వారిపడవక్రిందుగానే నిశబ్దంగా, మందగమనంతో అతిగంభీరమైన హృదయంతో సాగి పోతున్నది.

మరునాడు జానకితో చెప్పకుండా, పురుషోత్తం విశాలాక్షిని ఆమెతల్లినితీసుకొని రత్నగిరికి బయలు దేరాడు. రత్నగిరి వకపల్లెటూరు. విశాలాక్షి తండ్రికట్టించినయింట్లో బసచేశారు. సెలవుదినాల్లో విశాలాక్షి, తల్లి, అక్కడనేవుండడము మామూలు. వారి కక్కడ భూములున్నవి. మంచి పెద్దకుబసితూడా వున్నది. జానకితో చెప్పకుండా ఆడువారిసలహాప్రధానంచేసుకుని పురుషోత్తంరత్నగిరియెట్లాపోయాడాఅనుకుంటూ. జానకినివద ల్చుకోవడానికదేమార్గమని తోచింది కాబోలు! యెట్లా తెలిసినదో జానకికి. మరుచటిరైలులో బయలుదేరినది జానకి, రత్నగిరికి జానకికి. భయం, సిగ్గు, జేలదనంవదలి పోయి, ఆడుపులివలె సాహసం యెక్కువైనది. అవ కాశంలేక, జానకి నాతోగూడా చెప్పలేదు రత్నగిరి వెళ్లుతానని. రత్నగిరినుండి నాకొక ఉత్తరముమాత్రం వచ్చినది జానకివద్దనుండి. అది యిట్లాఉన్నది.

"సుదర్శనానికి నమస్కారాలు!"

"నాతో చెప్పకుండా, విశాలాక్షిని దానితల్లిని తీసుకుని, నాభర్తగారు రత్నగిరి వెళ్లడంచాత, ఆసంగతి అదృష్టవశాత్తు నాకు తెలియడంచాత నాకు నిన్ను కల సికొనుటకు అవకాశం లేకపోవడంచాత నీకు చెప్ప కుండా యిక్కడకు ఒంటరిగా వచ్చాను.

"యిక్కడకువచ్చి తిన్నగా విశాలాక్షి యింటికి వెళ్లాను. నాభర్తను కలసికొన్నాను 'నాకు తెలియకుండా అట్లా నన్ను చెన్నపట్నంలో వదలిపెట్టి వెళ్లిపోవడము న్యాయమా అని అడిగాను. అందుకు నాకు సమాధానం చెప్పలేదు. నాతో ఆయనమాటలాడలేదు. నాకువారింటభోజనమైనా పెట్టలేదు. పెట్టినా నాకు భోజనాపేక్ష లేదులే. నాబ్రదుకు చాలా హేయంగావున్నది. నేనీ తీరుగా యెన్నోదినాలు జీవించలేను. ఈఆకాశంక్రింద నాకు నిలవడానికి నీడ కానరాకుండావున్నది. నీవొ క్కడవుతప్ప నాహృదయ మెరిగినవా రింకొక రెవ్వరూ లేరు. నన్ను చూచి జాలిపడేవారు లేరు. నాచావున కేడ్చేవారు లేరు. నేను చావడం విశాలాక్షికేకాదు నాభర్తకుకూడా చాలా ప్రీతిగావుంటుంది. విశాలాక్షితల్లి చాలా దుర్మార్గురాలు; సాహసురాలు. నేను చచ్చిపోవడానికి సిద్ధంగానేవున్నాను. ఈస్థితిలో బ్రతికడము కంటె చావే చాలాసుఖం. నీవిచ్చటకు వంటనేవస్తే నిన్నుచూచి మరీచేస్తా నాపని. ఈజాబందగానే యిచ్చటికి వస్తావని నమ్ముతున్నాను.

రత్నగిరి.　　　　నీసోదరి, జానకి"

ఇంకొకసారి నిట్టూర్పులో మునిగాడు సుదర్శనం. ఈస్థితిలో సుదర్శనం కన్నులు మూసికొనిపోయినాయి. ప్రపంచమంతా భూకంపంవచ్చి కదలినట్లు కదలుతూం

దా అనిపిస్తున్నా దతడికి. అప్పారావునకు మతిపోయినది. ఈసారి మాటామంతీ మానివేసేడు అప్పారావు. తొడుగుకొన్న వస్త్రం ముందుభాగమంతా తడిముద్దైపోయింది అప్పారావుకి. 'కొంపదీసి జానకి ఆత్మహత్య చేసుకోదుకదా!' అనుకొని బెగ్గిపోతున్నాడు అప్పారావు. అంతలో ఒక పెద్దగొలుసు తెచ్చి పడేశాడు పడవవాడు అప్పారావు వెనక. త్రుళ్లిపడి ఆ చప్పుడికి సుదర్శనంమీద పడిపోయాడు అప్పారావు. దానితో యిద్దరకూ కళ్లు బాగా విడ్డవి. తెల్లవారుతున్నాదని తెలిసినది. "అప్పుడే తెల్లవారిపోతూందోయి" అన్నాడు అప్పారావు. సుదర్శనాని కదొక వింతగా కనిపించలేదు కాబోలు 'ఔను' సైతా అనలేదు. సుదర్శనం చెప్పడం అందుకున్నాడు.

"వెంటనే రత్నగిరికి వెళ్లాను నేను. విశాలాక్షి యింటికి వెళ్ళగానే జానకి నూతిలో పడి ప్రాణములు విడచిందని తెలిసినది. ఊరిలో కొందరు నాతో రహస్యంగా 'విషంపెట్టిచంపి నూతిలోపడవేసి తెల్లవారకముందే దహనంచేశారు. ఆవిడంతట ఆవిడ నూతిలో పడలేదన్నారు.' కారణమేదైనా, జానకి యీలోకం విడచి, నన్ను కడలేని దుఃఖంలో పడచి వెళ్లిపోయింది."

సుదర్శనం చెప్పడం ముగించాడు. కన్నులు మూశాడు. ఆకన్నులంట కొంచెము నీరు కారుతున్నది.

[చిత్రకారుఁడు: భ. రా. సో.]

రహస్యప్రణయము

సముద్రాల వెంకటరాఘవాచార్యులు గారు

సకియ! భవదీయమగు కటాక్షమ్మునుండి
పరువులిడువాగతీత లావణ్యలహరి
బ్రదుకు కడు స్వల్పమయ్యెను బ్రతి నమస్క-
రించి యర్పింప నీదు దాతృత్వమునకు.

ఎంతహరిభక్తిపరులు లజ్జించినారు
కోమలశ్యామలారాళకుంతలముల
ప్రేమ గొప్పవారలె సంచరించిరనుచు
వినుట నారెంత మది విలాపించినారు.

దుఃఖబాష్పోపహతము నాదు హృదయంబు
త్రుంపబడియెనుగద తునాతునకలట్లు
కాని నీవేత్రహతికి నగ్గమగువారి
కెన్నఁడునుగాని శాంతి లభింపఁబోదు.

నీపదములందు గర్వము న్విడచి ఫాల
తలము సోక మ్రొక్కెద విశుద్ధప్రియమున
నీహృదయసన్నిధిని వస్త్రనియతి నున్న
నీవపరిచితుఁడ వటందు నేల నన్ను?

ఓరహస్యప్రణయినీ! మహోగ్రదుఃఖ
కాననముల నిర్భీతి మజ్జ్వాను పగిది
ప్రేమవాగ్దాన నూత్న నివేదనమ్ము
దాల్చి భవదుపలబ్ధికై తరలువాఁడ.